క్లుప్తంగా

మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

నింద్ర: మండలంలోని కేఆర్‌పాళెం గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, అభిషేక పూజల అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గంగాధర నెల్లూరు: మండల సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం ఎంపీపీ అనిత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం



సన్మానం అందుకుంటున్న భాస్కర్

నింద్ర: మండలంలోని కొప్పేడు పంచాయతీ వేదాంతపురం పాఠశాల సోషియల్ ఉపాధ్యాయుడు భాస్కర్ ఆదివారం ఉత్తమ అవార్డు అందుకున్నారు. కృష్ణ జిల్లా నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషియల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

గంగాధర నెల్లూరు: యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. మండల గౌరవాధ్యక్షులుగా కేశవన్, అధ్యక్షులుగా రాజేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు అసోసియేట్ అధ్యక్షులుగా శాంతి, రంజిత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మునిక్రిష్టారెడ్డి, కోశాధికారిగా భానుప్రకాష్, కార్యదర్శులుగా బాబూజీ, ప్రతాప్‌కుమార్, డేనియల్, శైలజ, జిల్లా కౌన్సిలర్లుగా గణేష్ కుమార్, నాగరాజు, దామోదర్, గుణశేఖర్ రెడ్డి, ధనుంజయను ఎంపిక చేసినట్లు తెలిపారు.

సమానత్వానికి ప్రతిరూపమే రాజ్యాంగం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పుత్తూరు: స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మేళవించిందే భారత రాజ్యాంగమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక నగరం రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రజలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సమానత్వం లభించేలా రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. ప్రాథమిక హక్కులు ప్రజలకు రక్షణ కవచంగా నిలిచాయన్నారు. మానవ హక్కులకు భంగం కలిగినప్పుడు దేశ అత్యున్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ సుబ్రమణ్యం, ట్రస్ట్ నాయకులు అపరంజి, కుప్పయ్య, మహేష్, బాలమురగన్, ధనపాల్, శంకరయ్య, మావిల్లయ్య, నాగేంద్ర, విజయ్, గురుస్వామి, ఏలుమలై, కైలాసం పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

శ్రీరంగరాజపురం : మండలంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కన్వీనర్ మణి, నాయకులు జనార్దన్, మునికృష్ణ, హరిరెడ్డి, యువరాజ్, జయ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ప్రభుత్వ కళాశాలలో..

వెదురుకుప్పం : మండలంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ కళాశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కీలకపాత్ర వహించారన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.



ఎస్సార్‌పురం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు



వెదురుకుప్పం: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఘనంగా కార్తీక దీపోత్సవం





పాలసముద్రం: నెయ్యి దీపాన్ని మొక్కుకుంటున్న భక్తులు, అఖండ జ్యోతిని వెలిగిస్తున్న భక్తుడు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామివారు

కార్వేటినగరం: మండలకేంద్రంలో కుమార గిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలకంరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళా భక్తులు ఈశ్వరలింగాన్ని ఏర్పాటు చేసి ఆలయంలో నేతి దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కేశవ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జ్వాలాతోరణం

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని గంగాధరేశ్వరస్వామిఆలయంలో ఉదయం మహారుద్రాభిషేకాలు, ప్రత్యేక బిల్వార్చన, ఆకాశ దీపం, లక్ష దీపార్చన, జ్వాలాతోరణం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించి, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కోట్రకోన శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో, యస్‌యస్ కొండలోని శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు.

బాలగురునాథీశ్వర స్వామి ఆలయంలో..

పాలసముద్రం: మండలంలోని రాచపాల్యం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి, వివిధ అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులు తెచ్చిన పాలు, పెరుగు, తేనె, నెయ్యితో అభిషేకాలు చేశారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు వివిధ రకాల పూలమాలలు, 51 పసుపు నీటి బిందెలను స్వామివారికి సమర్పించారు. సాయంత్రం స్వామి వారిని అలంకరించి, ఎదుట 25 కిలోల నెయ్యితో దీపం గెలిగించారు. అనంతరం మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు గెలిగించి స్వామివారికి తొమ్మిది సార్లు ప్రదక్షిణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.





గంగాధరేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు, దేవాలయ ఆవరణలో పిండిదీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రజారంజక పాలనకు మళ్లీ అవకాశం ఇవ్వండి



ప్రజాతీర్పు రసీదు, బుక్‌లెట్ అందిస్తున్న సురేష్‌రాజు

పుత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలన సాగిస్తున్నారని, ఇది కొనసాగాలంటే మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని వడమాలపేట మండల జేసీఎస్ కన్వీనర్ ఎం.సురేష్‌రాజు తెలిపారు. ఆదివారం వడమాలపేట మండలం కదిరిమంగళం పంచాయతీలో వై ఏపీ నీడ్స్ జగన్! కార్యక్రమం నిర్వహించారు. 'ఆపు బాబు నీ నాటకం!, జగనన్నే మా నమ్మకం' అంటూ నినాదాలు చేస్తూ, గడప గడపకు వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు, చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజా తీర్పును కోరారు. ఈ సందర్భంగా ప్రతి గడపలో 2014లో చంద్రబాబు వాగ్దానాలు, 2019లో జగనన్న వాగ్దానాలను వినిపించారు. ఎవరు ఏవేవి నెరవేర్చారో రిపోర్టు బుక్‌లో నమోదు చేశారు. అలాగే ఏపీకి ఎవరు కావాలి? జగన్ లేదా బాబు? నివాసి సమాధానంతో కూడిన ప్రజాతీర్పు పుస్తకంలో నమోదు చేశారు. రిపోర్టు కార్డులో నివాసి చేత సీల్ వేయించి, ప్రజాతీర్పు రసీదును అందజేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌రాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసింది కాబట్టే గడప గడపకు వచ్చి వివరించగలుగుతోందని తెలిపారు. డీసీసీ బ్యాంకు డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, నాయకులు చైతన్య, ప్రదీప్, పల్లవి, పృథ్వీ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాకు అన్యాయం చేసిన త్రిమూర్తులు



మాట్లాడుతున్న సీపీఎం నేత మురళి

పుత్తూరు: ఒకే వేదికపై నుంచి 2014 ఎన్నికల సందర్భంగా మోదీ, చంద్రబాబు, పవన్ ఇచ్చిన వాగ్దానాలు ఏవీ నెరవేర్చలేదని సీపీఎం జిల్లా నేత కె.మురళి ధ్వజమెత్తారు. హామీలు నెరవేర్చకుండా తిరుపతికి వచ్చిన మోదీ గో బ్యాక్ అంటూ నినదించారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. 2014 ఏప్రిల్ 30న తిరుపతి ఎన్నికల వేదికపై నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి సాక్షిగా సీమాంధ్రను అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రత్యేక హోదా ఇస్తామని, వెంకయ్యానాయుడు పార్లమెంటులో ప్రకటించిన ప్రతి విషయాన్ని నెరవేరుస్తామని హామీ ఇచ్చి మోదీ ఏ ఒక్క విషయాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. ఏ హామీని నెరవేర్చకుండానే తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ తిరుపతికి రావడం సిగ్గుచేటన్నారు. నిధుల లేమితో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని తెలిపారు. రాష్ట్ర విభజన హామీలు ఒక్కదానిని నెరవేర్చలేదని ఆరోపించారు. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి రూ.1,050 కోట్లు విడుదల చేసి, వాటిని తిరిగి వెనక్కి తీసుకొన్న ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీజేపీకి వంత పాడుతున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆంధ్ర ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. వీరందరికి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పనున్నారని పేర్కొన్నారు. ప్రధాని రాక సందర్భంగా సీపీఎం నాయకులను హౌస్ అరెస్టులు చేయడం ప్రజల గొంతు నొక్కడమేనని అన్నారు.

ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెనుమూరు(కార్వేటినగరం): వారంతా ఒకే పాఠశాలలో చదువుకున్నారు. ఆ తరువాత ఎవరు ఎక్కడ స్థిరపడ్డారో తెలియదు. అయితే పెనుమూరు ఉన్నత పాఠశాలలో 1996 నుంచి 2001 వరకు చదువుకున్నవారందరూ కలుద్దాం అంటూ నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారం అందరూ ఆదివారం పాఠశాలలో కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చిన్ననాటి సంఘటనలను గుర్తుకు తెచ్చుకుని సరదాగా గడిపారు. తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు పద్మనాభనాయుడు, జయచంద్రారెడ్డి, శ్రీనివాసులను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అబ్బాయిలందరూ అమ్మాయిలకు తమతోబుట్టువుగా భావించి పసుపు కుంకుమతోపాటు చీరలను అందించారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాలకు రూ.25 వేలు విలువ చేసే రెండు బీరువాలను అందించారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజు, చంద్రబాబు, జయపాల్, మురళి, నజీర్ పాల్గొన్నారు.

మండలానికి చేరిన క్రీడా సామగ్రి



కార్యాలయంలోకి చేరుతున్న క్రీడాసామగ్రి

గంగాధర నెల్లూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసే క్రీడా సామగ్రి ఆదివారం మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయానికి చేరుకుంది. ఎంఈవో ఆంజనేయులు శెట్టి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 109 పాఠశాలలకు క్రీడా సామగ్రి రాష్ట్ర ప్రభుత్వం అందించినట్లు వెల్లడించారు. దీన్ని ఒకటి రెండు రోజులలో అన్ని పాఠశాలలకు చేరవేస్తామని ఆయన తెలిపారు.

పురవీధుల్లో శ్రీవేణుగోపాలుడి విహారం



విహారానికి బయల్దేరిన వేణుగోపాలస్వామి

కార్వేటినగరం: టీటీడీ అనుబంధ ఆలయంలో ఒక్కటైన శ్రీసంతాన వేణుగోపాలస్వామివారు కార్తీక దీపోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి గ్రామ వీధుల్లో విహరించారు. వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి, మూలవిరాట్‌ను పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళి జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారి ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై ప్రతిష్టించి మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధ్యక్షుడు సురేష్‌కుమార్, ఆలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలే శ్రీరామరక్ష

వర్ష, శీతా కాలాల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధులతో పాటు, కొత్తగడ్డిని మేసే పశువులు, గొర్రెలు, మేకలు బలహీనంగా తయారయ్యే అవకాశం ఉంటుంది. గడ్డిపై పరాన్న జీవులు సోకిన పశువులు మలమూత్రాలను విసర్జించడం, ఆగడ్డినే పశువులు గొర్రెలు, మేకలు మేయడం ద్వారా అంటు వ్యాధులు సోకి బలహీనపడుతాయి. సకాలంలో తగిన వైద్యం అందించకపోవడం ద్వారా అవి మృతి చెందే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఇలా సీజనల్‌గా వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణోపాయాలను వడమాలపేట పశువైద్యాధికారి డాక్టర్ ఎం.మురళీధర్‌రెడ్డి ఇలా తెలియజేశారు

–పుత్తూరు



జనావారి కోటాలలో పశువులకు పిడుదుల మందు పిచికారి చేస్తున్న వైద్యాధికారులు

గొంతు వాపు (గురక వ్యాధి)

వ్యాధి లక్షణం: ఆయాస పడుతూ శ్వాస తీయడం, నాలుక బయటికు పెట్టి శ్వాస తీసుకోవడం, గురక శబ్దం వినబడడం, గొంతు పైభాగాన, కింది భాగాన వాపు రావడం. కళ్లు ఎర్రబడి నీరు కారడం, జ్వరం తీవ్రత 104 నుంచి 106 ఫా.హీ వరకు పెరిగి 24 గంటల్లో పశువు చనిపోవడం. ఈ వ్యాధి ఎక్కువగా గేదెల్లో, గొర్రెల్లో కనబడుతుంది.

చికిత్స: గొంతు వద్ద వాపు కనిపించిన వెంటనే పశువైద్యశాలకు తీసుకొచ్చి సల్ఫామందును ఇంజెక్షన్ ద్వారా 5 రోజుల పాటు ఇవ్వాలి. ముందు జాగ్రత్తగా టీకా మందును వాడవచ్చు.

దొమ్మ రోగం:

వ్యాధి లక్షణం: ముక్కు, నోటి నుంచి రక్తంతో కూడిన పదార్థం వస్తుంది. విపరీతమైన కడుపు నొప్పి ఉంటుంది. రక్త విరేచనాలు అవుతాయి. జ్వరం ఎక్కువై రెండు మూడు గంటల వ్యవధిలో పశువు అకస్మాత్తుగా చనిపోతుంది.

చికిత్స: దొమ్మ రోగం సోకిన పశువును సాధ్యమైనంత త్వరగా డాక్టర్ వద్దకు తీసుకొచ్చి యాంటీబయాటిక్ మందులతో చికిత్స అందించాలి. వర్షా కాలానికి ముందు ఏటా జూన్, జూలై మాసాల్లో వ్యాధి నిరోధక టీకా వేయించాలి. ఈ వ్యాధి లక్షణాలతో చనిపోయిన పశువు కళేబరాన్ని కోయకూడదు. వ్యాధితో చనిపోయిన పశువు ముక్కు, నోటి నుంచి క్రిములు బయటకు రాకుండా దూదిని నింపాలి.

జబ్బవాపు

లక్షణాలు: 6 మాసాల నుంచి 2 సంత్సరాల వయస్సు కలిగిన తెల్లజాతి పశువుల్లో ఈ లక్షణాలు ఎక్కువగా కనబడుతుంది. జబ్బ, తొడ భాగంలో వాపు ఉండి, అక్కడ వేడిగా ఉంటుంది. వాపు ఉన్న చోట కరకరమని శబ్దం చిన్నగా వినిపిస్తుంది. జ్వరంగా తీవ్రంగా ఉంటుంది. కుంటుతూ నడుస్తాయి. చిన్న పశువులు అకస్మాత్తుగా మృతి చెందుతాయి.



ఎల్ఎం కండ్రిగలో ఆవుకు చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారి

చికిత్స: వ్యాధి లక్షణాలు కనబడిన వెంటనే డాక్టర్ వద్దకు తీసుకొచ్చి యాంటీబయాటిక్స్ మందులు వాడాల్సి ఉంటుంది. ఏటా వర్షా కాలానికి ముందు వ్యాధి నిరోధక టీకా విధిగా వేయించాలి.

సర్రా (కుందేటి వెర్రి)

లక్షణాలు: ఏకకణ సర్రా పరాన్నజీవుల జోరీగల ద్వారా రక్తంలో ప్రవేశించి వ్యాధిని వ్యాప్తి చేసే ఈ వ్యాధిని సర్రా లేదా టిపససోమీయాసిస్ తిరుగుడు వ్యాధి అని కూడా అంటారు. వ్యాధి సోకిన పశువును కుట్టిన జోరీగ మరో పశువును కుట్టడంతో దానికి కూడా వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులు వెర్రి చూపులు చూడడం, బలహీనపడుతాయి. పళ్లు కొరుకుతూ గుండ్రంగా తిరుగుతాయి. మూత్ర విసర్జన ఎక్కువగా చేస్తాయి. ఒక్కోసారి హఠాత్తుగా మృతి చెందుతాయి.

చికిత్స: వెంటనే డాక్టర్‌ను సంప్రదించి గ్లూకోజ్, విటమిన్లు ఇప్పించాలి. జోరీగలు పశుపాకల్లోకి ప్రవేశించకుండా క్రిమిసంహారక మందులతో పిచికారీ చేయించాలి. ఈ వ్యాధి నివారణకు టీకా లేదు.

వైద్యుల సలహాలు పాటించాలి



పాడి రైతులు ముందస్తు నివారణ చర్యల ద్వారానే పశువులను రక్షించుకొనేందుకు వీలుంటుంది. డాక్టర్ల సలహా మేరకే మందులు వాడాలి. పాడి రైతులు తీసుకోవల్సిన చర్యలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. రైతు భరోసా కేంద్రాల్లో గొర్రెలు, మేకలు పెంపకందారులకు అవగాహన కల్పిస్తున్నాం. రోగ నిరోధక శక్తి పెంచేందుకు పశువులకు మిశ్రమ లవణాలు, పాతర గడ్డి ఇవ్వాలి. సబ్సిడీతో గడ్డిని పొందాలంటే పశుసంవర్థక శాఖలో సంప్రదించాలి.

–డాక్టర్ ఎం.మురళీధర్‌రెడ్డి పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు, వడమాలపేట పశువైద్యశాల

ప్లాస్టిక్‌తో పర్యావరణ ముప్పు



మాట్లాడుతున్న భారతి

నారాయణవనం: ప్లాస్టిక్‌ను అవసరాలకు మించి వాడడంతో పర్యావరణానికు ముప్పు ఏర్పడుతుందని శ్రీభారత్ సోషల్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కీళగరంలో మహిళలకు అవగాహన కల్పిస్తూ, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంస్థ అధ్యక్షురాలు భారతి, జాయింట్ సెక్రటరీ రేణుక మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోకుంటే భవిష్యత్తు తరాలు ఇబ్బందులను ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే గ్లోబెల్ వార్మింగ్‌తో మంచు కొండలు, ఐస్ బర్గ్‌లు కరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్లాస్టిక్‌ను వినియోగిస్తే పుడమి కాలుష్యాయానికి గురి అవుతుందని తెలిపారు. కాటన్ సంచులను ఉపయోగించాలని పిలుపునిచ్చారు. చివరిగా పర్యావరణాన్ని కాపడుతాం అని ప్రతిజ్ఞ చేశారు.

మండల సమావేశం రేపు

పుత్తూరు: పుత్తూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10–30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మునివేలు అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

దేదీప్యం.. చుక్కాణి ఉత్సవం

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా చుక్కాని ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. -శ్రీకాళహస్తి







